# సాక్షి
## రంగారెడ్డి

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024






**'అవేర్' సేవలు భేష్**

పేదలకోసం అవేర్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. 8లో▸



**షెల్టర్ ఇవ్వలేదనే హత్య**

ఆలూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ హార్యానాయక్ హత్యకేసును చేవెళ్ల పోలీసులు ఒక్క రోజులోనే ఛేదించారు. 8లో▸



**గంజాయి కేసులో రిమాండ్**

గంజాయి విక్రయిస్తున్న ఓ విద్యార్థి తోపాటు కొంటున్న యువకుడిని ఎస్ఓటీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 8లో▸

## న్యూస్‌రీల్

### కలెక్టర్‌ను కలిసిన డీటీసీ చంద్రశేఖర్‌గౌడ్



సాక్షి, సిటీబ్యూరో: జిల్లా ఉపరవాణా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన డీటీసీ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ శనివారం కలెక్టర్ శశాంకను మర్యాదపూర్వకంగా కలిశారు. రహదారి భద్రతపై ప్రధానంగా దృష్టి సారించినట్లు ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు వివరించారు.

### ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడిగా మోహన్ నాయక్



మోహన్ నాయక్

మహేశ్వరం: ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మహేశ్వరం మండలం పెద్దమ్మ తండాకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కాట్రావత్ మోహన్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్ శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి గిరిజన తండా, ఆదివాసీ గూడాలను పర్యటించి.. పార్టీ సిద్ధాంతాలను తెలియజేసి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రాణం తీసిన ఫుట్‌బోర్డు ప్రయాణం

**ఆర్టీసీ బస్సులోంచి జారిపడి ప్లంబర్ దుర్మరణం**



రమేశ్ మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆర్టీసీ బస్సులో నుంచి జారి పడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మేడు గ్రామానికి చెందిన నదిరి రమేశ్(36) ప్లంబర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కుర్మేడు నుంచి రాకపోకలు సాగిస్తూ తుర్కయంజాల్‌తో పాటు నగరంలో పనులు చేసుకుని ఇంటికి వెళ్తుండేవాడు. రోజు మాదిరిగానే రాత్రి 7గంటల సమయంలో తుర్కయంజాల్‌లో దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కాడు. బస్సులో ప్రయాణికుల రద్దీ ఉండడంతో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్నాడు. బస్సు అరకిలో మీటర్ దూరం వెళ్లగానే ప్లంబర్ కాలు జారికింద పడ్డాడు. దీంతో బస్సు వెనుక చక్రాలు ఆయన మీదుగా వెళ్లడంతో ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. డ్రైవర్ ఆంజనేయులు నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది. ఘటనా స్థలిని సీఐ రాఘవేందర్‌రెడ్డి పరిశీలించారు.

### గ్రేటర్‌లో 'పీక్' డిమాండ్

**గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం**

సాక్షి, రంగారెడ్డి జిల్లా: గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ 'పీక్' స్థాయికి చేరుకుంది. 2023 జనవరి, ఫిబ్రవరి మాసాలతో పోలిస్తే.. 2024లో విద్యుత్ డిమాండ్ గరిష్ఠ స్థాయికి చేరుకుంది. గత ఏడాది జనవరితో పోలిస్తే ఈ ఏడాది జనవరిలో 9.47 శాతం డిమాండ్ నమోదు కాగా, గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరి డిమాండ్ 12.27 శాతం అధికంగా నమోదైంది. గత ఏడాది ఫిబ్రవరిలో గ్రేటర్ గరిష్ఠ డిమాండ్ 2930 మెగావాట్లు ఉండగా, ఈ నెల 23న(శుక్రవారం) ఏకంగా 3174 మెగావాట్లకు చేరింది. గతంలో సరాసరి విద్యుత్ వినియోగం 51.69 ఎంయూలు ఉండగా, తాజాగా ఇది 57.34 ఎంయూలకు చేరింది. రోజురోజుకూ పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవడంతో గృహ, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం పెరిగింది. ఫలితంగా విద్యుత్ వినియోగం కూడా భారీగా నమోదవుతుంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యుత్ డిమాండ్ పీక్‌స్థాయికి చేరుకుంటుండటంతో ఫీడర్లు ఒత్తిడికి గురవుతున్నాయి.

# భారీగా 'చేయి'రేలా..

**దూకుడు పెంచిన కాంగ్రెస్ పార్టీ**

- టార్గెట్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా
- ఇప్పటికే పార్టీలో చేరిన వికారాబాద్ చైర్‌పర్సన్
- తాజాగా రేవంత్‌ను కలిసిన రంగారెడ్డి చైర్‌పర్సన్
- వీరితో పాటు 27న మరికొందరు ప్రియాంక సమక్షంలో పార్టీలో చేరే అవకాశం



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొంది, అధికారాన్ని 'హస్త'గతం చేసుకున్న కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని భావిస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నుంచి పార్టీలోకి భారీగా చేరికలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతిపక్ష బీఆర్ఎస్ టార్గెట్‌గా దూకుడు పెంచింది. ఇప్పటికే వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి సహా నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన సతీమణి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియొద్దీన్, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి హస్తం గూటికి చేరుకున్నారు. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కూడా ఇప్పటికే బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. ఇటీవల ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కూడా కలిశారు. తాజాగా ఆయన కోడలు, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి దంపతులు సైతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చర్చలు జరిపారు. కారు దిగి.. త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్న సంకేతాలు ఇచ్చారు. శనివారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ దంపతులు మోతె శ్రీలతా శోభన్ రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఆదివారం వారు పార్టీలో చేరే అవకాశం ఉంది. ఇలా లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ దూకుడు ప్రదర్శిస్తుండటం, హైదరాబాద్ సహా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఒకరి తర్వాత మరొకరు పార్టీని వీడుతుండటం ఆ పార్టీకి గుక్క తిప్పుకోకుండా చేస్తోంది.

### 27కు ముందే చేరికలు

కాంగ్రెస్ పార్టీకి చేవెళ్లకు విడదీయరాని అవినాభావ సంబంధం ఉంది. పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా ఇక్కడి నుంచే ప్రారంభిస్తు వస్తోంది. దివంగత సీఎం వైఎస్సార్ 2004కు ముందు ఇక్కడి నుంచే పాదయాత్ర ప్రారంభించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత జలయజ్ఞం పథకాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 'ఎస్సీ డిక్లరేషన్'ను ఇదే వేదికగా ప్రకటించింది. మొదటి నుంచి ఈ సెంటి మెంట్‌ను కొనసాగిస్తూ వస్తున్న కాంగ్రెస్ తాజాగా 200యూనిట్లలోపు వినియోగదారులకు ఉచిత విద్యుత్ పథకం సహా రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 27న చేవెళ్ల కేంద్రంగా ఈ పథకాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు కూడా చేస్తోంది. సీఎం సహా మంత్రులంతా హాజరు కాబోతుండటం, కార్యక్రమానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తుండటం విశేషం. భారీ జన సమీకరణతో పాటు పెద్ద ఎత్తున చేరికలకు ముహూర్తం ఫిక్స్ చేసింది. అధికారిక కార్యక్రమం కావడంతో కలెక్టర్ శశాంక సహా సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సభాస్థలికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. ఈలోపే పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లను పార్టీలోకి చేర్చుకోవాలని నిర్ణయించింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షి సమక్షంలో పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ప్రియాంక సమక్షంలో కీలక నేతలను పార్టీలోకి చేర్చుకునేందుకు ప్లాన్ సిద్ధం చేసింది. మాజీ ఎమ్మెల్యే తీగల సహా ఆయన కోడలు అదే రోజు పార్టీలో చేరే అవకాశం ఉందని తెలుస్తోంది.



వివిధశాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

# చేవెళ్ల సభకు సన్నద్ధం

- ఈనెల 27న మరో రెండు గ్యారంటీ పథకాల అమలు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సైబరాబాద్ సీపీ
- వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన కలెక్టర్ శశాంక

చేవెళ్ల: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఆరుగ్యారంటీ పథకాల్లో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను ఈనెల 27న ప్రారంభించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చేవెళ్లలో నిర్వహించే సభా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు శనివారం ఉదయం ఫరా ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌ను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్‌బాబు, సీఐ లక్ష్మారెడ్డి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. పార్కింగ్ స్థలాలు, వీఐపీ పార్కింగ్, హెలిప్యాడ్ స్థలం తదితర వాటిని పరిశీలించారు. సభా వేదిక పరిసరాలకు సంబంధించి మ్యాప్‌లు సిద్ధం చేసుకొని ఎక్కడెక్కడ పార్కింగ్‌లు ఏర్పాటు చేయాలనేదానిపై చర్చించారు.

**అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలి**

కలెక్టర్ శశాంక సాయంత్రం విద్యుత్‌శాఖ సీఎండీ ముసరఫ్‌అలీ, రవాణశాఖ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్ఈ వెంకన్న, డీఈఈ శివశంకర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీఓ శ్రీలత, మిషన్‌భగీరథ డీఈ రాజేశ్, ట్రాన్స్‌పోర్ట్, ఫైర్ స్టేషన్, పోలీస్‌శాఖ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సభ నిర్వహణపై వారితో చర్చించారు. శాఖల వారీగా ఎవరికి కేటాయించిన బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తించి.. సభను విజయవంతం చేసేందుకు సహకరించాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జనం వచ్చే అవకాశం ఉంది కాబట్టి తగిన విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, బాత్‌రూమ్‌లను సిద్ధం చేయాలని సూచించారు. సభా స్థలం వద్ద భద్రతా ఏర్పాట్లపై డీసీపీ శ్రీనివాస్‌తో చర్చించారు. సమావేశంలో ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ హిమబిందు, ఏడీ స్వామి, ఏఈ నయీమొద్దీన్, ఆర్ఐ రాజేశ్, పవన్, ఈసీ రాజశేఖర్, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ తదితరులు పాల్గొన్నారు.

**సభా స్థలిని పరిశీలించిన ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డి**

చేవెళ్లలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి శనివారం రాత్రి పరిశీలించారు. ఫరా ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌ను ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, కలెక్టర్ శశాంకతో కలిసి పరిశీలించారు. సభా ఏర్పాట్లు, నిర్వహణకు సంబంధించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకాగాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, రాష్ట్రం నలుమూలల నుంచి జనం రానున్న దృష్ట్యా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. వారి వెంట స్థానిక నాయకులు సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, రఘువీరారెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి

# పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

- కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి
- ప్రారంభమైన లీడ్ ఎర్త్ లీడర్ శిక్షణ కార్యక్రమం

కడ్తాల్: ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా భూమాత సంరక్షణ కోసం విద్యార్థులు పాటుపడాని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో, తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన లీడ్ ఎర్త్ లీడర్ శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. రంగారెడ్డి, నారాయణపేట్, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన సైన్స్ అధికారులు శ్రీనివాస్, భానుప్రకాశ్, ఎస్‌సీఈఆర్‌టీ సభ్యులు వెంకట్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, రమేశ్‌రావు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆనందమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయాలంటే విద్యార్థుల్లో సమగ్ర పరివర్తన జరగాలన్నారు. అనంతరం సైన్స్ అధికారులతో పాటు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు విద్యార్థులకు భూమాత సంరక్షణ గురించి సమగ్రంగా వివరించారు. శిక్షణ కార్యాక్రమానికి ఆయా జిల్లాలకు చెందిన 130 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో సీజీఆర్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, వివిధ రంగాల నిపుణులు స్నేహ (ఆర్గానిక్ ఫార్మింగ్), బొమ్మిశెట్టి సునంద (నాచురల్ ఫార్మింగ్), డాక్టర్ హరి సర్వోత్తమన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్(ఎన్ఐఎన్), శ్రీదేవి (వేస్ట్ మేనేజ్‌మెంట్), పర్యావరణ నిపుణుడు వర్ధన్, శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి, చైతన్యబాల కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్, సీజీఆర్ ప్రతినిధులు వెంకటేష్, బీరేశ్, లక్ష్మీప్రసన్న, నగేశ్, సుశ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'పది'కి పకడ్బందీ ఏర్పాట్లు

**అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా, సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం 237 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 50,946 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు 37 పోలీస్ స్టేషన్లను గుర్తించారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని నిర్ణయించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలని.. పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులతో పాటు ఆశా వర్కర్ ఏఎన్ఎంలను, సిబ్బంది నియమించాలని వైద్యాధికారికి సూచించారు.

**మౌలిక వసతులు సమకూర్చాలి**

ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు ఉండే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకొని బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులకు చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. పరీక్షలు ప్రారంభమయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఐఈఓ శ్రీదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంధర్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి**

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో శనివారం ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 195 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం 74,875 మంది, రెండో సంవత్సరం 74,191మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు 31 పోలీస్ స్టేషన్ల గుర్తించినట్లు పేర్కొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో
# పోలీసుల పాత్ర కీలకం



ఆయుధాలు భద్రపరిచే గదిని ప్రారంభిస్తున్న స్వాతి లక్రా

ఇబ్రహీంపట్నం రూరల్: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని అడిషనల్ డీజీ స్వాతిలక్రా పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఆక్టోపస్ థర్డ్ బెటాలియన్‌లో ఆయుధాలు భద్రపరిచే గది, మరికొన్ని గదులు, క్యాంటీన్‌ను శనివారం ప్రారంభించారు. అదనపు గదులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేసేలా చూడాలని టీఎస్ఎస్‌పీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ విజయ్‌కుమార్, ఐజీపీ ఎండీ రమేష్, చీఫ్ ఇంజినీర్ తులసీదాస్, థర్డ్ బెటాలియన్ కమాండెంట్ వేణుగోపాల్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# రుణం పేరిట దగా

- రూ.50 లక్షలు కాజేసిన ముఠా
- రూ.46 లక్షలు స్వాధీనం
- పోలీసుల అదుపులో ఇద్దరు
- పరారీలో మరో ఇద్దరు



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న నగదు

మీర్‌పేట: రూ.5 కోట్ల రుణం ఇప్పిస్తామని పిలిపించి బెదిరించి రూ.50 లక్షలు కాజేసిన ముఠాలోని ఇద్దరిని మీర్‌పేట పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్ర రత్నగిరి జిల్లా అహ్మద్‌నగర్‌కు చెందిన వ్యాపారి బన్సీలాల్‌శర్మ (53) అదే ప్రాంతానికి చెందిన జమీర్ నిజాం ఖలీఫ్‌కు చెందిన రాజాపూర్ తాలూకాలోని 15 ఎకరాల వ్యవసాయ భూమిని రూ.5 కోట్లకు కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు గాను రుణం కోసం నగరంలోని ఎల్‌బీనగర్ మన్సూరాబాద్ ప్రెస్‌కాలనీలో నివసించే ఫైనాన్షియర్ వజ్రగిరి దుర్గప్ప అలియాస్ సురేందర్‌రెడ్డి (29)ని ఏడాది క్రితం పుణేలోని ఓ హోటల్‌లో కలువగా రుణం ఇప్పించేందుకు అంగీకరించాడు. దీనికి 6 శాతం పర్సంటేజీ ఇవ్వడంతో పాటు రూ.5 కోట్ల రుణాన్ని బదిలీ చేసేందుకు గాను ముందుగా రూ.50 లక్షల సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని అడిగాడు. అనంతరం దుర్గప్పతో పాటు అతని అనుచరులు విజయ్, వెంకటేశ్, మహేశ్‌తో కలిసి వెరిఫికేషన్ నిమిత్తం బన్సీలాల్‌శర్మ ఇంటికి వెళ్లి పాన్, ఆధార్‌కార్డులు, ఫొటోలు సేకరించి బ్యాంకు రుణం కోసం అవసరమైన పత్రాలు తీసుకున్నారు. ఆ తరువాత షరతు ప్రకారం సెక్యూరిటీ డిపాజిట్ రూ.50 లక్షలు అడిగారు. ఫిబ్రవరి 18న బన్సీలాల్‌శర్మ భూ యజమాని అయిన జమీర్‌నిజాం ఖలీఫ్ నుంచి చేతి బదులుగా రూ.25 లక్షలు తీసుకుని రూ.5 కోట్లతో కలిపి తీసుకున్న డబ్బును మొత్తం తిరిగిస్తానని హామీ ఇచ్చాడు. 19న దుర్గప్ప డబ్బుల కోసం బన్సీలాల్‌శర్మతోపాటు భూ యజమాని జమీర్ నిజాం ఖలీఫ్ అతని కుటుంబ సభ్యులను జిల్లెలగూడలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌కు పిలిపించాడు. వారు వచ్చాక దుర్గప్ప అతని సహచరులు విజయ్, వెంకటేశ్, మహేశ్ వారిని బెదిరించి వారి వద్ద ఉన్న రూ.50 లక్షలు లాక్కుని పారిపోయారు. అనంతరం సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. బాధితుడు బన్సీలాల్‌శర్మ మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రుణం పేరిట మోసానికి పాల్పడిన ముఠాలోని ఏ1 దుర్గప్ప, ఏ2 విజయ్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.46 లక్షల నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.

# ‘అవేర్’ సేవలు అభినందనీయం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మహేశ్వరం: పేదలకోసం అవేర్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్ సమీపంలో భగవతిపురంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరు శ్రద్ధ వహించాలన్నారు. ప్రతీ రోజు ఆరోగ్యం, యోగ్యం, ధ్యానం, వాకింగ్, వ్యాయామానికి కేటాయిస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరవన్నారు. అవేర్ మాధవన్‌జీ సంస్థ ఆధ్వర్యంలో మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్, కల్వకుర్తి, ఆమన్‌గల్, తలకొండపల్లి మండలాల్లో సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ శిబిరంలో 865 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ, అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ, సంస్థ ప్రతినిధులు రాజవర్ధన్‌రెడ్డి, మంజూర్ అహ్మద్, రమాకాంత్, సీతారామయ్య, వరుణ్, తరుణ్, నాగేశ్వర్‌రావు, వెంకన్న, సంజనారెడ్డి, ప్రవీణ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి, మాధవన్‌జీ

# షెల్టర్ ఇవ్వలేదనే హత్య

- నలుగురు నిందితులకు రిమాండ్
- వివరాలు వెల్లడించిన సీఐ లక్ష్మారెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చేవెళ్ల: ఆలూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ హార్యానాయక్ హత్యకేసును చేవెళ్ల పోలీసులు ఒక్క రోజులోనే ఛేదించారు. హత్యకు పాల్పడిన నలుగురిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్ వెల్లడించారు. ఆలూరుకు చెందిన శ్రీనివాస్ గ్రామంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. నేపాల్‌కు చెందిన సాగర్ మస్సింగ్‌సోదారి మాస్టార్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న నేపాల్, మహారాష్ట్ర వాసులైన సాగర్ స్నేహితులు.. బినోద్‌థప్ప, రమేశ్‌ధమి, ఉమేశ్ భగవన్‌జీ బండారి ఈనెల 21న సాగర్ వద్దకు వచ్చారు. రాత్రి పడుకునేందుకు షెల్టర్ కావాలని యాజమాని శ్రీనివాస్‌ను అడిగారు. దీంతో గ్రామ సమీపంలోని సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ హార్యానాయక్‌తో మాట్లాడి అక్కడ పడుకోమని సూచించాడు. దీంతో నలుగురు మిత్రులు సబ్‌స్టేషన్ వద్ద నిద్రించారు. 22న సైతం సాగర్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేశారు. ఓనర్ శ్రీనివాస్ లేకపోవటంతో షాప్ బంద్ చేసిన అనంతరం అంతా కలిసి మద్యం, కల్లు తాగారు. అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం తాగి మత్తులో ఉన్న వీరు పడుకునేందుకు సబ్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ రోజు కూడా ఇక్కడే పడుకుంటామని హార్యానాయక్‌కు చెప్పడంతో మద్యం మత్తులో ఉన్న వారిని చూసి వద్దని వారించాడు. దీంతో వాగ్వాదం జరిగింది. ఈ విషయాన్ని ఫోన్‌లో శ్రీనివాస్‌కు చెప్పాడు. నేపాల్ వ్యక్తులు వచ్చి తనతో గొడవ పడుతున్నారని వెంటనే రావాలని కోరాడు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు కర్రలు, రాళ్లతో హార్యానాయక్‌పై దాడి చేసి దారుణంగా హత్య చేశారు. అనంతరం అతని సెల్‌ఫోన్‌తో పాటు ఆఫీస్‌లోని ఫోన్ తీసుకుని పారిపోయారు. కొద్ది సేపటి తర్వాత సబ్ స్టేషన్‌కు చేరుకున్న శ్రీనివాస్ హత్యకు గురైనట్లు పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ ఇచ్చిన సమాచారం మేరకు లొకేషన్ ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్ పర్యవేక్షణలో చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్ కేసును ఛేదించారు. ఈ విషయం చేవెళ్లకు వచ్చిన సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి సీఐ లక్ష్మారెడ్డి ఆయన టీమ్‌ను అభినందించారు.

## ఫాంహౌస్‌పై ఎస్ఓటీ పోలీసుల దాడి

### 15 లీటర్ల మద్యం స్వాధీనం

మొయినాబాద్: అనుమతి లేకుండా మద్యం సేవిస్తూ పార్టీ నిర్వహిస్తున్న ఓ ఫాంహౌస్‌పై ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమంగళారం శివారులోని ఓ ఫాంహౌస్‌లో శనివారం రాత్రి అనుమతులు లేకుండా లిక్కర్ పార్టీ నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఫాంహౌస్‌పై దాడి చేసి పార్టీ నిర్వహిస్తున్నవారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గంజాయి విక్రేత, కొనుగోలుదారుడికి రిమాండ్

మొయినాబాద్: నగరం నుంచి గంజాయి ప్యాకెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న ఓ విద్యార్థి తోపాటు గంజాయి కొంటున్న యువకుడిని ఎస్ఓటీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిని మొయినాబాద్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కంకల్ గ్రామానికి చెందిన సీహెచ్. భరత్ జేబీఐటీ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. గంజాయికి అలవాటు పడిన భరత్ ఇటీవల సప్లయర్‌గా మారాడు. నగరం నుంచి గంజాయి తీసుకొచ్చి మండల పరిధిలో యువకులకు, కళాశాలల వద్ద విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం నగరంలోని నానక్‌రామ్‌గూడ నుంచి 200 గ్రాముల గంజాయి ప్యాకెట్లను తీసుకుని బైక్‌పై అజీజ్‌నగర్ చౌరస్తా వద్ద ఉన్న వీజేఐటీ కళాశాల వద్దకు వచ్చాడు. జేబీఐటీ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న మహారాష్ట్రలోని లాతూరుకు చెందిన షేక్ అలీం భరత్ వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నాడు. అక్కడే మాటేసిన రాజేంద్రనగర్ జోన్ ఎస్ఓటీ పోలీసులు ఇద్దరిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 40 గ్రాముల చొప్పున్న ఐదు ప్యాకెట్లు, బైక్, సెల్‌ను స్వాధీనం చేసుకుని మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు.

## బహిరంగ ప్రకటన

[illegible]

సం/- G. ప్రశాంత్ BCA, LL.B, న్యాయవాది షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా. 9848141321

## IN THE HONOURABLE COURT OF THE XIth ADDL. DIST. SESSIONS JUDGE AT L.B. NAGAR

**O.S. No. 198/2022**

Between:
Sri Chappidi Gopal Reddy .....Plaintiff
And:
Sri M.Aditya Varma & Others .....Defendants

To,
1. **M.Aditya Varma**, S/o. Rama Krishnam Raju, H.No: 97/3, MVP Colony, Visakhapatnam.
2. **M/s. Nava Yuga Engineering Company Ltd.**, DGM Mr. Rajesh Kiyawal, Flat No. 1259, Lakshmi Towers, Road No.-36, Jubilee Hills, Hyderabad-33
3. **M/s. NRI's Golden City**, its Partner S. Khaja Rahamtulla, S/o. Mahboob, Flat No-103, TNR's Vaishnavi Apartments, Red Hills, Lakdikapool, Hyderabad, Telangana.
4. **M.Rammohan Rao**, S/o. M.Chengaiah, Silverline Projects pvt. ltd. Plot No.-18/1, 21/1, Sri sampada arcade, Flat No-402C, Khachiguda, Ranga Reddy Dist., Telangana.
5. **M.Srinivas Gaud**, S/o. late Narayana gaud, Silverline Projects pvt. ltd., Plot No-18/1, 21/1, Sri Sampada Arcade, Flat No-402C, Khachiguda, Ranga Reddy Dist., Telangana.

**SUMMON**

The above named Plaintiff filed the above O.S. 198/2022 against the Defendants before the Honourable XIth Addl. Dist., Judge at L.B.Nagar, Ranga Reddy Dist., for specific performance suit. You are hereby required to appear before the Honourable XIth Addl. Dist. Judge at LB Nagar, RR District on Dt: **13-03-2024 at 10-30 AM.** Either in person or through your counsel. In default of your appearance on the aforesaid day next step will be taken by the Honourable court in your absence.

**P.PARVATEESWARA RAO**, Advocate
Flat No: D1, First Floor, Sri Sai Sadan Apartment, Dwaraka Nagar, Visakhapatnam -530016.
Cell : 8074635598
Visakhapatnam
Dt: 25-02-2024

## IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : SHADNAGAR, AT : SHADNAGAR

**O.S.NO.416 OF 2021**

BETWEEN
MD.SHUJATH ALI And another ... PLAINTIFFS
AND
MD.AZAR ALI And others ... DEFENDANTS

To
**D-6** Khaleda Begum, W/o Mohd. Atheruddin, Aged about 51 years, Occ: Housewife, **D-7** Rasheeda Begum, D/o Late Md.Mazar Ali, Aged about 48 years, Occ: Housewife Both are R/o Chowlapally Village, Farooqnagar Mandal, Mahaboobnagar District. **D-8** Rahmathunnisa Begum, W/o Late Mohd.Maqsood Ali, Aged about 70 years, Occ: Household, R/o H.No.5-72/1, Errakunta, Barkas, Hyderabad. **D-9** Nasera Begum, W/o Mohd. Ghousemohiuddin, Aged about 52 years, Occ: Housewife, R/o H.No.4-12-148/2/12, Pahadi Merrmomim, Kishanbagh, Hyderabad. **D-10** Nazera Begum, W/o Md.Ghousuddin, Aged about 68 years, Occ: Housewife, R/o Yanmunara Village, Farooqnagar Mandal, Mahaboobnagar District. **D-11** Afsar Begum, W/o Late Md.Jaffer, Aged about 65 years, Occ: Housewife, R/o Chowlapally Village, Farooqnagar Mandal, Mahaboobnagar District. **D-15** Mohammed Gayasuddin, S/o Ghouse Mohiuddin, Aged about 61 years, Occ: Business, R/o H.No.9-1-1/B/43, Defence Colony, Langer House, Asifnagar, Humayunnagar, Hyderabad. **D-17** Mohd.Saifuddin, S/o Mohd.Mohiuddin, Aged about 47 years, Occ: Business, R/o 20-3- 1/2A1/1, Doodh Bowli, Bahadurpura, Hyderabad. **D-22** Shabahath Ali, S/o Late Md.Abbas Ali, Aged about 42 years, Occ: Pvt. Employee **D-23** Shakira Begum, D/o Late Md.Abbas Ali, Aged about 48 years, Occ: Pvt.Employee **D-22 & 23** are R/o H.No.288/C, SRT Colony, Hyderabad. **D-25** Md.Ageel, S/o Late Mohd.Omer, Aged about 60 years, Occ: Business **D-26** Md.Tajuddin, S/o Late Mohd.Omer, Aged about 50 years, Occ: Driver R-25 & 26 are R/o Chowlapally Village, Farooqnagar Mandal, Mahaboobnagar District.**D-27** Md.Ziauddin, S/o Late Mohd.Omer, Aged about 46 years, Occ: Driver **D-28** Md.Zameeruddin, S/o Late Mohd.Omer, Aged about 40 years, Occ: Driver **D-29** Md.Samdani, S/o Late Mohd.Omer, Aged about 37 years, Occ: BusinessD-27 to 29 are R/o H.No. 19-4-340/54/45, Kishan Bagh, Hyderabad. D-32 Bilquis Begum, D/o Md.Razza Hussain, Aged about 61 years, Occ: Housewife, R/o H.No.19-2-137/B, Indra Nagar, Tadban, Falaknuma, Hyderabad.

**NOTICE**

The Plaintiffs have filed the above suit for Partition and Separate Possession against the Defendants which includes you in respect of (1) All that the Agriculture Land admeasuring Ac.10.38 Gts in Sy.No.66, situated at Chowlapally Village, Farooqnagar Mandal, Mahaboobnagar District, presently Ranga Reddy District and bounded on North: Land in Sy.Nos. 65 and 64, South: Land in Sy.No.49, East: Land in Sy.No.63, West: Land in Sy.Nos.80 and 83 (2) All that the Agriculture Land admeasuring Ac.1.04 Gts in Sy.No.348, Ac.2.06 Gts in Sy.No.349, Ac.2.21 Gts in Sy.No.370 and Ac.1.32 Gts in Sy.No.371, situated at Chowlapally Village, Farooqnagar Mandal, Mahaboobnagar District presently Ranga Reddy District and bounded on North: Land in Sy.Nos.304 and 318, South: Land in Sy.Nos.367, 368, 369 and 372, East: Land in Sy.No.372, West: Kalva. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to 15.03.2024 at 10.30 a.m. and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence, this Notice.

**[BY ORDER OF THE COURT]**
Sd/-
**SANGISHETTY NARSIMHA**, Advocate
Plot No.23 Part, Ganesh Nagar Colony, Vanasthalipuram, Hyderabad.